


# జల్లుల్లో జల్సాలు

నేను కోరుకున్నట్టుగానే ఈ బెజవాడ ఇంటి వాళ్లకి కూడా కారుంది. ఒకటి కాదు, రెండు కాదు మూడు. కానీ మనకేం వుపయోగం ? సువర్ణలాటి అమ్మాయి లేదు కదా బడి కెళ్ళేందుకు ! దాంతో కారెక్కి బడికెళ్లే భోగం ఏలూర్లోనే వదిలేయాల్సి వచ్చింది.

రోజూ టయం కన్నా గంట ముందు బయల్దేరడం, కాళ్లీడ్చుకుంటూ బెల్లు కొట్టేటప్పటికి చేరడం. మధ్యాహ్నం అన్నాలు తెచ్చేందుకు ఈ వూళ్లో గంపలెత్తుకుని అమ్మాయి లుంటారు. దాంతో కారియరు మోసే పనిలేదు. కానీ నడవడం వల్లేమో కారియర్లో ఎంతన్నం తిన్నా ఇంకా నీరసంగానే వుంటుంటే అమ్మతో చెప్పా: ''అన్నం చాలాట్లేదూ ! మధ్యాహ్నం క్లాసులర్థం కూడా అవట్లేదూ ఆకలికీ ! ఇంకో గిన్నెలో కూడా అన్నం పెట్టూ'' అని. మా అమ్మాజీ గారేవన్నారో తెల్సా! ''ఇప్పుడు నీకు పాఠం అర్థం మాత్రవే అవట్లేదూ ఇంకా తింటే అసలే పాఠం చెప్తున్నారో తెలియను కూడా తెలియదు'' అని.

అమ్మలన్నాక ఏదో కొంచెం మంచివాళ్లల్లాగా కొన్ని తెలిసినట్లుగా కొన్ని అర్థం కానట్లుగా వుంటే బాగుంటుంది కానీ ఇలా హెడ్‌మిస్ట్రస్ లాటి అమ్మలు మనింట్లోనే వుంటే

ఎంత కష్టం ! మనం ఎంత కష్టపడి చెప్పినా, దానికో సమాధానం వుంటుందావిడ గారికి !

నెమ్మదిగా పుస్తకాల సంచీని మైనం కాయితంలో చుట్టా బయల్దేరదామని. బయట సన్నగా తుప్పరపడుతోంది. కిటికీలోంచి చూస్తే తెల్లారకట్లలాగా చీకటి చీకటిగా వుంది. టైం చూస్తే ఎనిమిదయి పోయింది. అమ్మ గొంతు వినిపించింది.

''సుశీలా ! ముసురుగా వుంది కదా బాగా ! ఈ పూటకి బడి మానేయరాదూ !''

''బడి మానేసి చూరు నీళ్లల్లో కాయితం పడవలు ఆడుకోవాలా ఏంటమ్మా ! నాకు రెండు లెఖ్ఖల క్లాసులున్నాయి. మళ్లీ అర్థం కావు. మంగళవారం అయితే మానేద్దును'' అన్నా.

''మంగళవారం మానేయడం నాకస్సలు కుదరదు. ఈవేళ ఫరవాలేదు'' అంది చిన్నారి.

''నీకు ఫరవాలేకపోతే నువ్వు మానెయ్యి! నే పోతున్నా'' అని అంటుంటే అది మళ్లీ రెట్టించింది.

''అవున్లే! పాపం చెట్లెలా ఏడ్చాయో చూడాలి కదా వెళ్లు ! వెళ్లు!'' అని.

అమ్మ చెవిన పడనే పడిందా మాట. 'చెట్లేడవడమేమిటే పిచ్చి వాగుడూ మీరూనూ! ఒక్కరవ్వ తెరిపిచ్చింది. బయల్దేరండి. ఈవేళ్టికి ఇందు రాదులే'' అంటూ కారియరమ్మాయి వస్తుందో రాదోనని మా చేతికే ఇచ్చేసింది కారియరు.

శాస్త్రానికి గొడుగు పుచ్చుకుని బయల్దేరాం. ఒకళ్లు గొడుగు ఇంకోళ్లు కారియరు పట్టు కోవాలన్నమాట. అమ్మ గుమ్మం దాకా వచ్చి చెప్పింది ''మరీ జల్లెక్కువయితే ఎవరి వసారాలో నయినా నిలబడండమ్మా ! తడిస్తే జరాలొస్తాయి జాగర్త'' అని.

నాకసలెప్పుడూ తడిస్తే జ్వరం రాదు. మహా అయితే తుమ్ములొస్తాయి. కానీ ఎండలో తిరిగితే మాత్రం నాకు పడదు కాబట్టి జరం వచ్చేస్తుంది. రోడ్డెక్కాక ఇంక ఆగలేకపోయాను.

''ఏవే చిన్నారీ ! ఎప్పుడో నీకు నా చేతుల్లోనే రాసుంది. చెట్లేడవడం చూస్తానని అమ్మతో చెప్తావా ? నిన్ను నమ్మి నా రహస్యం చెప్తే ఇదా నువ్వు చూపించే విశ్వాసం ! అమ్మగానీ సరిగా వినుంటే ఆరాలు తీసి నా ప్రాణం తీసేది కదా !''

''ఏదో నోరు జారాలే మహాతల్లీ! ఇంక తిట్టకూ'' అని మాట్లాడకుండా నడిచింది. తప్పు దాని మీదుంది కదా ! ఇంకెందుకు నోరెత్తుతుందీ ? నే చెప్పే స్కూలు కబుర్లు అమ్మ వినిపించుకోపోడం వల్ల జల్లొస్తే ఎవరి వసారాలోనయినా నిలబడమంది కానీ అసలు మా స్కూలు దారిలో ఇళ్లుంటే కదా ! అన్నీ బంగళాలే. వాచ్‌మన్లు ఎలాగూ మన్ని లోపలికి రానివ్వరు కదా! ఇంకపోతే పేద్ద పేద్ద చెట్లుంటాయి గానీ అవి తడవడానికే వీలు.

మా స్కూలు గేటులోంచి బోల్డు దూరం నడుస్తే గానీ క్లాసులు రావు. ఇదివరకు స్కూళ్లల్లోలా మేరీ మాతుండదు స్కూలు బయట. ఇక్కడ సిస్టర్లు కూడా వుండరు.

అందరు టీచర్లనీ మిస్ అని పిలవాలి. మంచి మంచి గంజిపెట్టిన వాయిల్ చీరలు, ప్లెప్పులు ప్లెప్పులుగా కట్టుకుని పిన్నులు పెట్టుకుంటారు. ఒక్క ప్రిన్సిపాల్‌గారు మాత్రం గౌనేసుకుంటారు. ఈ స్కూల్లో అన్నీ చాలా స్ట్రిక్టు. మనం తప్పకుండా జడకి రిబ్బనో పూలో పెట్టుకోవాలి. లేపోతే పురికొస పెట్టేస్తారు. అలా చాలా చాలా అవమానాలు చేస్తారు. కొంచెం బట్టల మీద మట్టయిం దనుకో. మురికి పిల్ల అని రాసి వీపుకు కట్టేస్తారు. అలా అవమానం చేస్తే చచ్చైనా పోవాలనిపిస్తుందీ! చంపెయ్యాలనైనా అనిపిస్తుంది. నాలుగు కొడితే ఫరవాలేదు దులిపేసుకోవచ్చు గానీ ఇలా చెయ్యడం ఎంత తప్పు ! ఓసారి మా హిందీ టీచరు నాకెంత అవమానం చేసిందో ! అదేంటో చెప్పనుగానీ రోజూ ఆవిడ్ని చంపేసినట్లే నాకు కల. నాన్న లేపి మరీ చెప్పారు. ''తప్పమ్మా అలా టీచర్లని కలల్లో చంపకూడదూ'' అని. మరి నిజంగా చంపితే వూరుకుంటారేవిటీ ? జైల్లో పడేస్తారు. అయినా మొన్ననే నిద్దట్లో ఒకటే నవ్వుతుంటే ఎందుకమ్మా అని నాన్నడిగినపుడు ''హిందీ టీచర్ని పాడిచేస్తే పాపం చచ్చిపోయారు నాన్నా!'' అని చెప్పబట్టి కదా తెలిసింది తనకీ !

ఏంటేంటో అనుకుంటూ నడుస్తుంటే దూరం తెలియనే లేదు. ''అస్సలు తడవకుండా స్కూలొచ్చేసింది'' అని చిన్నారింత గొంతెత్తుకుని అరవడంతో వులిక్కి పడ్డాను. దూరంగా స్కూలుగేటు కనిపించింది ఓ ఇరవై చెట్లవతల. ఇంకా హెడ్‌మిస్ట్రెస్ గేటు దగ్గిరున్నట్లు లేరు. తడి పిల్లలెవరూ రావట్లా.

''మా అమ్మే! ఇందుకా నిన్ను నాతో రానిచ్చిందీ ! ఈవేళ క్లాసులో కూచుని పాఠాలన్నీ వినేందుకు నాకేవన్నా పిచ్చెక్కిందనుకుంటున్నావా ? జిగురు పోగెయ్యాలని చెప్పలా ! పద ఆ చెట్టు కిందకి. పది నిమిషాల్లో బోల్డు వానొస్తుంది!'' అని దాన్ని కూడా తీసుకుని ఓ చెట్టు కిందకి పరిగెత్తా.

పెద్ద జల్లొచ్చి రక్షించింది. ఇద్దరం తడిసి ముద్దయిపోయాం. నేను గొడుగుపట్టుకుంటే అది కాసేపూ, అది గొడుగు పట్టుకుంటే నేను కాసేపూ పూర్తిగా తడవడం పని అయ్యాక బయల్దేరాం. మరి హెడ్‌మిసెస్ తలని ముట్టుకు చూసే కదా చెప్తారు ! క్లాసుకెళ్లాల్సిందో, ఇంటి కెళ్లాల్సిందో !

మాలాటి వాళ్లే ఎవరో ఇద్దరమ్మాయిలు హాయిగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్లి పోతున్నారు. ఏంటని అడిగితే తడిసిన పిల్లల్ని హాస్టలమ్మాయిల బట్టలన్నా కట్టుకోమంటున్నా రుట. లేపోతే ఇంటికన్నా పొమ్మంటున్నారుట. ఇంకా లీసం చెయ్యకూడదని ఒక్క పరుగు పెట్టాం. వాన కూడా మామీదకలాగే పరిగెట్టింది. సరిగ్గా గేటు దగ్గిర ఆగాం. మా కారియరు నీళ్లు కారి పోతోంది. పుస్తకాల సంచీలు బానే వున్నాయి మైనం కాయితంలో. తలల మీద

చేతులు పెట్టారు హెడ్‌మిస్ట్రెస్. తడి ముద్దలు. దూరంగా ఇద్దరు టీచర్లు అందరికీ బరాబరా తలలు తుడిచేస్తు న్నారు. క్లాసులోకి పొమ్మంటారేమోనని భయం వేసింది.

''హాస్టలమ్మాయిల బట్టలు వేసుకుంటారా?'' అనడిగారు.

''వద్దు మిస్! మా అమ్మగారు కోప్పడతారు. చలికి వణుకొచ్చేస్తోంది'' అన్నాం.

''పోండి! ఇంటికెళ్లి బట్టలు మార్చుకోండి. రేపు రండి బడికి.''

మళ్లీ పరుగు. ఎంత అదృష్టమో మాది. పాపం చాలామందికి తలలు తుడిచేసి క్లాసుల్లోకి పంపేశారు. ఓ పదిమంది వేవన్నా తప్పించుకున్నావేమో ! అందరూ వెళ్లిపోయే వరకూ రేడియో స్టేషను గూట్లో కూచుని అప్పుడు బయల్దేరాం మా చెట్టు దగ్గరికి. అంటే కిందటిసారి గాట్లు పెట్టినచెట్టు దగ్గిర కన్నమాట. అన్ని చెట్లూ మనకి పనికి రావు. కిందపెద్దపెద్ద పుట్టలుంటాయి కదా మానందుకోడానికి వీల్లేకుండా ! ఒక్క మా చెట్టు కిందయితే పెద్ద నల్లబండ రాయుం టుంది ఎక్కేందుకు వీలుగా ! రాయెక్కి చూస్తే మేం గాట్లు పెట్టిన ప్రతీచోట బోల్డు బోల్డు బందరు హల్వాలాగా ముద్దలు ముద్దలు జిగురు కారి చక్కగా వుంది మా కోసం. ఇంకా నయం ఎవరి కంటా పడలేదు. కారియరు లో అన్నం తినేసి గిన్నెలు ఆ వాన నీళ్లల్లో కడిగేసి ఆ జిగురంతా బ్లేడుతోటీ చెంచాతోటీ తీసేటప్పటికీ పైగిన్ని నిండిపోయింది.

అన్నీ సర్దుకుని ఇల్లు చేరేటప్పటికి అమ్మ గుమ్మంలోనే ఎదురయింది., ''అప్పుడే వదిలేశారా ? కస్తూరీ వాళ్లేరీ?'' అంటూ.

''అన్ని ఆరాలూ గుమ్మంలోనే తీస్తావేంటమ్మా. ఇంకా ముసురట్టేలా వుందని పెందరాళే వెళ్లి పొమ్మన్నారు. వాళ్లు హోంవర్కులు చేసుకునొస్తారట'' అని విసుక్కుంటు న్నట్టుగా చెప్పి పెరట్లోకి పరిగెట్టాం.

ఇంక అప్పట్నించీ ఎంత పనో చెప్పలేను. కాంపౌడరు గారి దగ్గిర్నించి తెచ్చి పోగేసిన పాత ఇంజక్షను సీసాలన్నీ వేడ్నీళ్లల్లో వేసి కడిగి తుడిచి అవి ఆరబెట్టావా ! మళ్లీ ఈ జిగురుముద్దల్ని పెద్ద గిన్నెడు నీళ్లల్లో కరగపెట్టి కొంచెం కొంచెం ఈ సీసాల్లో పోసి బిరడాలు పెట్టి లేబిలంటించావా ! మొత్తం ముప్ఫై ఆరు సీసాలయ్యాయి. మిగిలిన ముద్ద కాయితంలో చుట్టి అలమర్లో అడుగున దాచేశాం. ఇంక ఆ మర్నాడు బళ్లో మాతో మంచిగా వుండే పిల్లలకి ఒక్కో సీసా ఇచ్చేటప్పటికి మా పేరెంత హోరెత్తిపోయిందో ! అసలింత జిగురు మేం ఎలా చేశామో కూడా తెలియక ఎంత గోలో స్కూల్లో !

అందుకే మరి నాకు వానాకాలవంటే అంతిష్టం!